క్లుప్తంగా

కౌన్సిల్ సమావేశం వాయిదా

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. నరసరావుపేటలో వనం-మనం కార్యక్రమం ఉన్న నేపథ్యంలో గురువారం నిర్వహించాల్సిన సమావేశాన్ని శుక్రవారానికి వాయిదా వేస్తున్నామన్నారు. సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామన్నారు.

విడుదలైన ఆర్థిక సంఘం నిధులు

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మొదట విడతలో భాగంగా రూ.31 లక్షల 01 వేల 527 రూపాయలు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఈవోపీఆర్డీ పి.సుగుణ గురువారం తెలిపారు. గ్రామపంచాయతీ జనాభా ఆధారంగా ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయగా ఈనిధులు ఆయా గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు మాత్రమే వినియోగించాలన్నారు.

మరో విద్యుత్ ఉద్యమం తప్పదు

చిలకలూరిపేట: విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా మరో ఉద్యమానికి సిద్ధం కావాలని వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విద్యుత్ ఉద్యమంలో మృతి చెందిన అమరవీరుల 24వ సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపుకు వ్యతిరేకంగా 24 ఏళ్ల కిందట ఉమ్మడి రాష్ట్రంలోని బషీరాబాగ్‌లో జరిగిన ఉద్యమం లాంటి ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. ఇప్పటికే విశాఖపట్నంలో ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయనాయక్, పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జీవనాన్ని మెరుగుపర్చాలి

నరసరావుపేట: సంచార జాతులైన చెంచు, బుడగ జంగాలు, యానాదుల జీవన విధానం మెరుగుపర్చేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు కృషిచేయాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్ఎస్) ప్రోగ్రామ్ మేనేజర్ చుక్క శామ్యూల్ అనీల్‌కుమార్ కోరారు. గురువారం బరంపేట కమ్యూనిటీ మీటింగ్ హాల్లో డీబీఆర్సీ ఆధ్వర్యంలో సంచార జాతులు వేస్ట్ పికర్స్ జీవనోపాదుల అభివృద్ధిపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి డీబీఆర్ఎస్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ పీవో కృష్ణారెడ్డి, డీబీఆర్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.



భద్రత లేకపోతే విధులెలా నిర్వహిస్తాం?

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన సంఘటన అమానుషం. ఇటువంటి సంఘటన జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు కఠిన శిక్షలు అమలు చేయాలి. ప్రజల ఆరోగ్యం కాపాడటం కోసం విధులు నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడకుండా భద్రత, రక్షణ ఏర్పాట్లు ఉండాలి. విధి నిర్వహణలో మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించి శిక్షలు తీసుకురావాలి. మహిళలకు రక్షణ కరువైతే విధులు నిర్వహించలేం.

–డాక్టర్ ఎం.సాయివినూత్న, బొల్లాపల్లి పీహెచ్‌సీ





మహిళా వైద్యులకు భద్రత పెంచాలి

వైద్యులకు, వైద్య సిబ్బందికి నూరు శాతం రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం దుర్మార్గపు చర్య. ఇలాంటి దుశ్చర్యలకు అడ్డుకట్టు వేయాలంటే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. మహిళా వైద్యులకు భద్రత కల్పించే విషయమై శ్రద్ధ చూపాలి. రాత్రి వేళల్లో బీట్ కానిస్టేబుల్ వైద్యశాలలకు రక్షణగా ఉండాలి.

–డాక్టర్ రాయపూడి హనుమంతరావు, పెదకూరపాడు

చవితికి సిద్ధమవుతున్న గణనాథుడు

బొజ్జగణపయ్య చవితి వేడుకలకు సిద్ధమవుతున్నాడు. పిల్లా–పెద్దా అందరూ కలసి ఆనందంగా జరుపుకునే పండుగల్లో వినాయకచవితి ఒకటి. ఆ వినాయకుడి పూజకు ప్రధానంగా కావాల్సింది ప్రతిమలే. గృహాల్లో మట్టి గణపయ్యను పెట్టుకుని వ్రతాన్ని పూర్తి చేసుకుంటున్నా మండపాలు కట్టి ఐదు లేక తొమ్మిది రోజులపాటు పూజలు చేయాలనుకునే వారు ఖచ్చితంగా పెద్ద విగ్రహాల కొనుగోళ్లపైనే దృష్టిసారిస్తారు. అలాంటి పెద్ద విగ్రహాల తయారీకి కేరాఫ్‌గా నిలుస్తోంది నరసరావుపేట. రాజస్థాన్ నుంచి వచ్చిన రెండు వందల కుటుంబాలు ఆరునెలలుగా వేర్వేరు రూపాల్లో గణపయ్యలకు జీవం పోస్తున్నారు.

- వినాయక ప్రతిమల తయారీలో రాజస్థాన్ కళాకారులు
- అడ్వాన్స్‌లిచ్చి బుక్ చేసుకుంటున్న మండప నిర్వాహకులు
- మూడు నుంచి 15 అడుగుల వరకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు
- జిల్లాలో సుమారు 15 వేల విగ్రహాల తయారీ!
- 200 కుటుంబాలు రాక
- విగ్రహాల తయారీలో 600 మంది కార్మికులు



వేర్వేరు రూపాల్లో చవితి పూజకు సిద్ధమైన వినాయక విగ్రహాలు

నరసరావుపేట రూరల్: వినాయకచవితి పర్వదినం సందర్భంగా పూజలు అందుకునేందుకు గణనాథుల ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వాడవాడలా గణపతి నవరాత్రులు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాల కోసం విభిన్న ఆకృతుల్లో ఉన్న వినాయకుడి ప్రతిమలను కొనుగోలు చేసేందుకు నిర్వాహకులు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 వేలకు పైగా విగ్రహాలను తయారీదారులు సిద్ధం చేశారు.

జిల్లాలో 15 వేలకు పైగా విగ్రహాలు

జిల్లాలో ఈ ఏడాది వినాయక ప్రతిమల తయారీ పెరిగింది. గతంలో విగ్రహాల తయారీ పట్టణాలకే పరిమితం కాగా, ఇప్పుడు మండలాల్లో కూడా తయారు చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోనే ఏడు ప్రాంతాల్లో విగ్రహాల తయారీని నిర్వాహకులు చేపట్టారు. చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల, పెదకూరపాడుతో నకరికల్లు, క్రోసూరు వంటి గ్రామీణ ప్రాంతాల్లో విగ్రహాలను తయారు చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 15 వేలకు పైగా విగ్రహాలను తయారీదారులు సిద్ధం చేస్తున్నారు.


25 ఆకృతుల్లో ప్రతిమలు

వినాయక ప్రతిమల తయారీ కేంద్రంలో విభిన్నమైన ఆకృతుల్లో దర్శనమిస్తున్నారు. భక్తులను ఆకట్టుకునే విధంగా దాదాపు 25 రకాల ఆకృతుల్లో విగ్రహాలను రూపొందిస్తున్నారు. వీటికి రంగులు వేసి ఆకర్షణీయంగా సిద్ధం చేస్తున్నారు. మూడు అడుగుల నుంచి 13 అడుగుల భారీ విగ్రహాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వీటి ధర రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంది. గణేష్ ఉత్సవాలకు కొద్దిరోజులే సమయం ఉండటంతో విగ్రహాలను కొనుగోలు చేసేందుకు మండపాల నిర్వాహకులు క్యూ కడుతున్నారు. ఆకర్షణీయమైన విగ్రహాలను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు.

ప్రతిమల తయారీలో రాజస్థాన్ కళాకారులు

వినాయక విగ్రహాల తయారీని రాజస్తాన్ కళాకారులు కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నారు. విగ్రహాల తయారీనే వృత్తిగా ఎంచుకుని కొన్ని కుటుంబాలు ఇక్కడే నివసిస్తున్నాయి. దాదాపు 200 కుటుంబాలు విగ్రహాల తయారీపై ఆధారపడి జీవిస్తున్నాయి. వినాయక చవితి ఉత్సవాలకు ఆరు నెలల ముందు నుంచే విగ్రహాల తయారీని ప్రారంభిస్తున్నారు. ఇందుకోసం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను ఉపయోగిస్తున్నారు.

ఆకర్షణీయమైన రంగులపై ఆసక్తి



విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

ఉత్సవ కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాల్లో నెలకొల్పే వినాయక ప్రతిమలు ఆకర్షణీయంగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. కంప్యూటర్ గ్రాఫిక్స్ ద్వారా విగ్రహాన్ని రూపొందించి రంగులు వేసి చూసుకుని తరువాత కళాకారులతో ఆకర్షణీయంగా తయారు చేయిస్తున్నారు. ఇందుకు మాములు విగ్రహం కొనుగోలు చేసే ఖర్చు కన్నా ఎక్కువ అవుతుంది.. అయినా ఖర్చుకు వెనుకాడటం లేదు.



అమ్మకానికి సిద్ధమైన వినాయక విగ్రహాలు

అమ్మకాలు బాగుంటాయని భావిస్తున్నాం



నాగార్జునసాగర్ నుంచి సాగునీరు విడుదల కావడంతో రైతులు పొలం పనుల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. రైతుల్లో ఉత్సాహం ఉంటే గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇప్పటికే మండప నిర్వాహకులు వచ్చి విగ్రహాలను చూసి వారికి నచ్చిన విగ్రహాలను బుక్ చేసుకుంటున్నారు.

–పాశం అంకిరెడ్డి, విగ్రహాల తయారీదారుడు, నరసరావుపేట

విభిన్నమైనవే ఇష్టపడతారు



చవితి ఉత్సవాలు చేసే వాళ్లు రంగుల విగ్రహాలనే కొలువు తీర్చేందుకు ఇష్టపడతారు. విగ్రహాలను ఆకర్షణీయంగా, ప్రత్యేకతతో కూడిన విధంగా ఉంటే డిమాండ్ ఉంటుంది. మేం చిన్నతనం నుంచి విగ్రహాలు తయారు చేసే పనిలో ఉన్నాం. రాజస్థాన్ నుంచి దాదాపు 200 కుటుంబాలు ఇక్కడికి వచ్చి విగ్రహాలు తయారు చేస్తున్నాయి.

– ప్రేమ్, విగ్రహ తయారీదారుడు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



పసుమర్రు జెడ్పీ హైస్కూల్‌లో చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం



తెలుగు తల్లి తదితర వేషధారణల్లో మోడరన్ విద్యాసంస్థల విద్యార్థులు



గణపవరం హైస్కూలులో సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాకేష్

ఈపూరు: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి, జాతీయ క్రీడ అయిన హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మాతృభాషా జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు భాషా కోవిదుడు గిడుగు వెంకట రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు తెలుగు భాషా ఔనత్యాన్ని వివరించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు కోలాట ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణానాయక్, పీడీ వేణుగోపాల్, పీఈటీ జాస్తి శ్రీకాంత్, తెలుగు ఉపాధ్యాయులు నరేష్ నాయక్, శ్రీనునాయక్, సుధాకర్ పాల్గొన్నారు.

మధురమైనది తెలుగుభాష

చిలకలూరిపేట: తెలుగుభాష ఎంతో మధురమైనదని పసుమర్రు ఎస్ఎంకే జెడ్పీహైస్కూల్ హెచ్ఎం వై హనుమంతరావు చెప్పారు. పాఠశాలలో తెలుగు భాషాదినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు భాషపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు పఠాన్ ఖాదర్‌మస్తాన్ క్రీడల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివిధ పాఠశాలల్లో...

మోడరన్ విద్యా సంస్థల్లో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్ మాట్లాడుతూ తెలుగు భాష ఎంతో ప్రాచీనమైనదని, ప్రపంచ దేశాల్లో 19 కోట్ల మంది తెలుగుభాష మాట్లాడేవారు ఉన్నారని తెలిపారు. విద్యార్థులు తెలుగుతల్లి, గిడుగు రామమూర్తి పంతులు, తదితర వేషధారణల్లో ఆకట్టుకున్నారు. పెదనందిపాడు రోడ్డులోని వికాస్ విద్యాసంస్థల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లిరోడ్డులోని న్యూఅమరావతి పబ్లిక్ స్కూల్‌లో తెలుగు భాషా సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంబరాలలో శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని తెలుగు భాషా గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. వ్యవహారిక భాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అబ్దుల్‌రహీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవం

నరసరావుపేట రూరల్: విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కళాశాలలో పలు క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. ఫన్ గేమ్స్ అక్టివిటి విభాగంలో క్యాండిల్ బాల్, గ్లాస్ పిరమిడ్, బెలూన్ హ్యాండ్లింగ్, టీం బెల్డింగ్ బెలూన్ గేమ్స్‌తో పాటు సాంస్కృతిక పోటీల విభాగంలో ఏకపాత్ర అభినయం, భరతనాట్యం, గ్రూప్‌డాన్స్ తదితరు పోటీలు నిర్వహించారు. పోటీల లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్‌షరీఫ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి కళాశాలలో

జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భారత దిగ్గజ హాకీ ఆటగాడు ధ్యాన్‌చంద్ గౌరవ సూచకంగా ఆయన పుట్టినరోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్ రావు, డిప్లమో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఏఎంరెడ్డి కళాశాలలో క్రీడాదినోత్సవం..

ఘనంగా స్పోర్ట్స్ డే, తెలుగు భాష దినోత్సవం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని మహాత్మా జ్యోతిరావ్ పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన గురుకుల బాలుర పాఠశాల నందు అంతర్జాతీయ స్పోర్ట్స్ డే, తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం హెచ్ఎం వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, శారీక దృఢత్వం లభిస్తుందన్నారు. క్రీడలు, తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏటీపీ రాధా, పీఈటీ జోనానాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ వేడుకల్లో ఉపాధ్యాయులు

క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవాలి



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవటం ద్వారా నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించగలరని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని గురువారం కళాశాల క్రీడా మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, వైస్‌ప్రిన్సిపల్ ఎంఆర్‌కె సతీష్, పిడి ఈదర ఆదిబాబు పాల్గొన్నారు.

వాగ్దేవి డిగ్రీ కళాశాలలో...

రావిపాడురోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సైతం ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిన మున్సిపల్ చైర్మన్**

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీకి చెందిన చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని టీడీపీలోకి ఫిరాయించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో ఆయన టీడీపీలో చేరారు. రఫానికి టీడీపీ కండువా కప్పి ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆహ్వానించారు.

● **ఎరువుల దుకాణాల్లో తనిఖీలు**

నరసరావుపేట రూరల్: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, స్టాక్ పరిశీలించారు.

● **టూటౌన్ ఎస్‌గా హరిబాబు**

నరసరావుపేట టౌన్: టూటౌన్ ఎస్ఐగా ఏ. హరిబాబు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రేపల్లెలో ఎస్‌గా పనిచేస్తూ బదిలీపై వీరు ఇక్కడకు వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

● **ఈ–పంట నమోదుపై అవగాహన**

శావల్యాపురం: స్థానిక రైతుసేవా కేంద్రంలో ఈ–పంట నమోదు, పంట కోత ప్రయోగంపై రైతు సేవా కేంద్రం వీఏఏలు, వీఆర్వోలకు సమావేశం గురువారం నిర్వహించారు. రైతులు సాగు చేసిన అన్నీ రకాల పంటలను ఈ–పంట నమోదు చేసుకోవటం ద్వారా బీమా తదితరవన్నీ అర్హత పొందటానికి దోహదపడుతుందన్నారు.

సంక్షిప్త వార్తలు

● **ఆర్‌జేడీ విచారణ**

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మండల వనరుల కేంద్రంలో ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి ఉపాధ్యాయులు బదిలీపై విచారణ చేపట్టారు. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలో అక్రమాలు జరిగాయని ఏపీటీఎఫ్ యూనియన్ నాయకుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ లోపాలు ఉన్నాయని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఫిర్యాదు చేయడంతో ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం అక్రమాలని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

● **కమిషనర్‌కు సన్మానం**

వినుకొండ(నూజెండ్ల): పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుభాష్ చంద్రబోస్‌ను శ్రీ వాసవీ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి వ్యాపారస్తులందరూ సహాయసహకారాలు అందించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బాలకృష్ణారావు, చిలంకూరి సుబ్రహ్మణ్యం, కోట వెంకటేశ్వర్లు, మండవ వెంకట కిరణ్‌కుమార్, చిలంకూరి వెంకట కోటేశ్వరరావు, అన్నా వెంకట సుబ్బారావు, గజవల్లి వెంకట శివయ్య, పువ్వాడ కృష్ణ, గుర్రం బాలసాయికుమార్ పాల్గొన్నారు.

● **జ్వర పీడితులపై గ్రామాల్లో సర్వే**

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గ్రామాలలో గురువారం వైద్య సిబ్బంది పర్యటించారు. ఆయా గ్రామాలలో పర్యటించిన వైద్య సిబ్బంది జ్వరపీడితుల గుర్తింపు కోసం విస్తృత సర్వే చేయడం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.రేవతీబాయి మాట్లాడుతూ జూన్ నుంచి అక్టోబర్ వరకు సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు, సీజనల్ వ్యాధు లు ప్రబలే అవకాశముందన్నారు.

● **విప్పర్లలో గ్రామోత్సవం**

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో త్రైత సిద్ధాంతం ప్రభోత సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం శ్రీకృష్ణభగవానుడికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక చిలకలూరిపేట కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు, యద్దనపూడి రామాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ పాల్గొన్నారు.

